RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# భూమి పూజకు ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున రావాలి

## - రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల విజయభాస్కర్




**జూలూరుపాడు: సెప్టెంబర్ 11 ( తెలంగాణ వాణి ):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ ఉప్పల్ బగాయతులో ఆర్యవైశ్య మహాసభకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో జరుగు భూమి పూజ( శంకుస్థాపన) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ స్టేట్ సెక్రటరీ పెండ్యాల విజయభాస్కర్ కోరారు. భూమి పూజ అనంతరం శ్రీనివాస కళ్యాణం, 10.30 గంటలకు ఆత్మీయ సమ్మేళనం జరగనున్నట్లు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు ఆర్యవైశ్య ప్రముఖులు టీజీ వెంకటేష్, బొగ్గారపు దయానంద్, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, బిగాల గణేష్ గుప్తా, కోలేటి దామోదర్, పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు, ఎంతో ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల, మండలాలు పట్టణాల నుండి ఆర్యవైశ్య సోదర సోదరీమణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజయ భాస్కర్ కోరారు.

# పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డికి సన్మానం చేసిన కొత్వాల



**పాల్వంచ (తెలంగాణ వాణి)** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస రెడ్డి ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా శుక్రవారం సత్కరించడం జరిగింది. మద్ది శ్రీనివాసరెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తో పాటు కొత్వాల, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై కేవలం దళితుడనే ఉద్దేశ్యంతో ఉద్దేశ్య పూర్వకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు మరో ఎమ్మెల్సీ లు అనుచిత వ్యాఖ్యలు చేశారని, వారిని వెంటనే పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులకు దళితులంటే ఏహ్యాభావన ఉందని, దళితులను తక్కువగా చూడటం పరిపాటి అయిందన్నారు.ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మోటార్ కార్మికులకు వేతనాలు పెంచాలి

## బోనస్ వెంటనే చెల్లించాలి: తోడేటి నాగేశ్వరరావు



**టేకులపల్లి, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):** కోయగూడెం ఓపెన్‌కాస్ట్ నుంచి కొత్తగూడెంకు బొగ్గు రవాణా చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచడంతో పాటు బోనస్ వెంటనే చెల్లించాలని మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం టేకులపల్లిలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, యూనియన్ జిల్లా కార్యదర్శి డి. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఏడాది డ్యూటీ పూర్తి చేసిన కార్మికులకు బోనస్ చెల్లించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రశాంత్, రమణయ్య, నేపాల్, రాజేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## - తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి




**టేకులపల్లి, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):** సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు తేజావత్ శంభునాయక్ ఆధ్వర్యంలో నాయకులు టేకులపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. టేకులపల్లి మండల కేంద్రంలోనూ అధికారికంగా వేడుకలు నిర్వహించాలని కోరారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పలువురు ప్రాణత్యాగాలు చేశారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధరావత్ బాలాజీనాయక్, బోడా పుణ్యానాయక్, భూక్యా రవి రాథోడ్, బోడ గంగ, నెల్లూరి సత్యం, భూక్య రాందాస్ నాయక్, ధరావత్ బాల తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లకు హైకోర్టు అండ

## 27 ఏళ్ల న్యాయపోరాటానికి ఊరట

## ఆనందోత్సాహాల్లో లబ్ధిదారులు




**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)** కొత్తగూడెం పట్టణంలోని గాంధీనగర్, బుడిదగడ్డ ప్రాంతంలో పేద కుటుంబాలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాల విషయంలో సాగుతున్న సుదీర్ఘ న్యాయపోరాటానికి తెలంగాణ హైకోర్టు తాజా తీర్పుతో కీలక ఊరట లభించింది. 1999లో హెచ్ టీటీపీ // అర్ ఓ సీ నం సీ – 8336/98, 1999 ఏప్రిల్ 13 తేదీ ద్వారా సర్వే నంబర్లు 142, 143లో పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 110 చదరపు గజాల చొప్పున హౌస్ సైట్ పట్టాలు కేటాయించబడ్డాయి. ఆ స్థలాల్లో పేద కుటుంబాలు పక్కా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. 2004లో తొలగింపు చర్యల ప్రయత్నం జరగడంతో బాధితులు హెచ్ టీటీపీ // డబ్ల్యు. పి.నం.69 ఆఫ్ 2005 దాఖలు చేయగా 2005 జనవరి 11 న హైకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. అనంతరం 2018లో సర్వే నంబర్ 143 రెగ్యులరైజేషన్ కోసం డబ్ల్యూ పీ నం .9125 శీట 2018 దాఖలు కాగా, దరఖాస్తులను చట్టప్రకారం పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది.ఈ క్రమంలో తమ శాంతియుత స్వాధీనానికి రక్షణ కల్పించాలని కోరుతూ 8 మంది పిటిషనర్లు హెచ్ టీటీపీ :// డబ్ల్యూ. పీ.నం 11029 ఆఫ్ 2021ను దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై 2026 ఆగస్ట్ 25న జస్టిస్ పుల్లా కార్తీక్ కీలక ఆదేశాలు జారీ చేశారు.చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా పిటిషనర్ల శాంతియుత స్వాధీనం, అనుభవంలో జోక్యం చేసుకోవద్దని హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది.హైకోర్టు తీర్పు కాపీలను పిటిషనర్ల తరఫున న్యాయవాది మారపాక రమేష్ కుమార్ కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, డీఎస్పీ, వన్ టౌన్, త్రీ టౌన్ సీఐలకు అందజేశారు.

# ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం

## ఖమ్మం సర్వజనాసుపత్రిలో విస్తరిస్తున్న ఆధునిక వైద్య సేవలు

## త్వరలో అందుబాటులోకి రానున్న ఎంఆర్ఐ..

## మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు




**ఖమ్మం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):** ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఆధునిక వైద్య పరీక్షలు, రేడియాలజీ సేవలు విస్తరిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ప్రత్యేక పర్యవేక్షణతో పరికరాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, వైద్య నిపుణుల నియామకానికి చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర మంత్రుల ప్రత్యేక శ్రద్ధతోనూ ఆసుపత్రి సేవలు మరింత బలోపేతమవుతున్నాయి.
ఇప్పటికే మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు, పోర్టబుల్ ఎక్స్‌రే అందుబాటులోకి వచ్చాయి. దీంతో కదలలేని, అత్యవసర రోగులకు పడక వద్దే పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ వంటి ఆధునిక పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో ఎంఆర్ఐ సేవలు ప్రారంభించేందుకు సివిల్ పనులు, విద్యుత్ సదుపాయాల ఏర్పాటును వేగవంతం చేస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు ఆసుపత్రిలో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించగా, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 16,961 స్కాన్లు చేశారు. ఇందులో 8,945 ఓబీజీ, 5,417 ఉదర భాగం, 546 టిఫ్ఫా, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి. గర్భిణీలకు టిఫ్ఫా స్కాన్ సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందడం విశేషం.
రేడియాలజీ సేవలను బలోపేతం చేసేందుకు నిపుణులను అందుబాటులోకి తీసుకువస్తుండగా, ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి కూడా చర్యలు చేపడుతున్నారు. ఆధునిక పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ప్రైవేటు వైద్య ఖర్చుల భారం తగ్గనుంది.

# దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం

## - బీఆర్ఎస్ నాయకులు క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్ నేతలు



**అచ్చంపేట, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):** దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద జరిగిన ఘటనను నిరసిస్తూ బల్మూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు వినతిపత్రం సమర్పించారు.
మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెల్లమల్ల రాంప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలు దళిత సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా ఉన్నాయని ఆరోపించారు. దళిత సమాజానికి బీఆర్ఎస్ నాయకులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఖదీర్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీపతిరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, మైలారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు చందునాయక్, ప్రధాన కార్యదర్శి సంపంగి రమేష్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్లస్వామి, యువ నాయకులు ఆనంద్, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పద్మశాలి మహిళా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**అచ్చంపేట, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):** అచ్చంపేట శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరానికి మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పులిజాల కళ్యాణి, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు శ్రావణి, కోశాధికారిగా కోట ప్రశాంతి ఎన్నికయ్యారు. పలువురిని కార్యవర్గ సభ్యులు, సలహాదారులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షురాలు పులిజాల కళ్యాణి మాట్లాడుతూ జ్ఞాన సరస్వతి దేవి ఆలయంతో పాటు పద్మశాలి మహిళా సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సంఘం, శివాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు మహిళా సంఘం పూర్తి సహ



కారం అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వనం పర్వతాలు, మాజీ అధ్యక్షురాలు దాసపత్రి శకుంతల, కోట దశరథం, పులిజాల శ్రీనివాసులు, చిలువేరు ధనరాజ్, దాసు శ్రీనివాసులు, కర్నాటి రాములు, వనం గీత, గుర్రం హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపానికి పోలీసు వారి అనుమతులు తప్పనిసరి

## - మధిర టౌన్ ఎస్.హెచ్.ఓ సీఐ దోమల రమేష్



**మధిర సెప్టెంబర్:11 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):-** గణేష్ నవరాత్రులలో భాగంగా పట్టణ వీధుల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్టపన చేసే నేపథ్యంలో నిర్వాహకులు మధిర టౌన్ పోలీసుల నుంచి తప్పకుండా అనుమతులు పొందాలని ఎస్ హెచ్ ఓ డి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గణేష్ విగ్రహ ఏర్పాటు చేసే నిర్వాహకులకు పోలీస్ ఇంటిమేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలన్నారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సిన నిర్వాహకులు ఆన్లైన్ ద్వారా ఇన్టిమేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.గణేష్ మండపం ఏర్పాటు చేసే ప్రదేశం,ప్రతిష్ఠాపన తేదీ,నిమజ్జనం తదితర వివరాలను దరఖాస్తులో నమోదు చేస్తూ నిర్వాహకుల పూర్తి వివరాలను మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా అందించాలన్నారు. పోలీస్ శాఖ సూచించే శాంతి భద్రతలు,ట్రాఫిక్ ఇతర నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,ఉత్సవ నిర్వాహకులు నిర్ణీత సమయంలో ఇన్టిమేషన్ దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించారు..

# ఒకరికే రెండు మరణ ధృవపత్రాలు

## - బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**అచ్చంపేట, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఒకే వ్యక్తికి వేర్వేరు తేదీలతో రెండు మరణ ధృవపత్రాలు జారీ చేసిన ఘటనపై పంచాయతీ కార్యదర్శి వి. రమేష్‌బాబును జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సస్పెండ్ చేశారు. వార్తల ఆధారంగా చేపట్టిన విచారణలో ఆన్‌లైన్ రికార్డుల్లో మరణ వివరాలను రెండుసార్లు నమోదు చేసినట్లు, రిజిస్టర్‌లో మాత్రం ఒక్కసారి నమోదు చేసినట్లు తేలింది. విధుల పట్ల నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణలో లోపాలు, అధికార దుర్వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని తెలంగాణ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఓ శ్రీరాములు తెలిపారు.

# రైతులకు ఆధునిక సాగుపై అవగాహన




**మధిర, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):** మధిర మండలం ఖమ్మంపాడులో ఆత్మ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఐ. వాణిశ్రీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం, పురుగు తెగుళ్ల నివారణ, సమగ్ర పంటల యాజమాన్యంపై మండల వ్యవసాయ అధికారి కె. సాయిదీక్షిత్ అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి విష్ణు ఉద్యాన పంటల సాగుతో అదనపు ఆదాయం పొందే అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజన బాబు, ఏఈఓలు సుష్మ, ప్రవళిక, జిష్ణు, రైతులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు పరిశీలన



**జూలూరుపాడు, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):** మండలంలోని పడమట నర్సాపురం గ్రామపంచాయతీ సమీపంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ అధ్యక్షుడు లేళ్ల గోపాల్‌రెడ్డి, హరీష్ నాయక్‌తో కలిసి విద్యుత్ ఏఈ స్థలాన్ని పరిశీలించారు. సుమారు 9 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, చుట్టుపక్కల ప్రాంతాల్లో లైట్లు అమర్చేందుకు ఎస్టిమేషన్ సిద్ధం చేస్తామని ఏఈ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు బాదావత్ హరీష్ నాయక్, ఏడవ వార్డు మెంబర్ నాగరాజు, శ్రీనివాసరావు, లైన్మెన్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం , సెప్టెంబర్ 12 , 2026

# సాయన్నపేట వద్ద కారు-లారీ ఢీ

## సకాలంలో స్పందించి ముగ్గురి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది





**టేకులపల్లి, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):** సాయన్నపేట సమీపంలో కారు –లారీ ఢీకొన్న ప్రమాదంలో 108 సిబ్బంది సకాలంలో స్పందించి ముగ్గురి ప్రాణాలను కాపాడారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన స్వప్న (35) తన ఇద్దరు పిల్లలు అన్విత్‌రామ్ (7), అశ్రిత్‌రామ్ (3)తో భద్రాచలం వెళ్తుండగా మూలమలుపు వద్ద ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వచ్చిన లారీ కారును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఇల్లెందు 108 సిబ్బంది ఈఎంటీ రేణుక, పైలట్ వేణుకుమార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ముగ్గురినీ కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

# ఘనంగా ముందస్తు హిందీ దివస్ వేడుకలు

**ఖమ్మం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**





న్యూ లక్ష్మీపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ముందస్తు హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ పరశురామ్ మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయ సమగ్రతకు హిందీ భాష వారధిగా నిలుస్తుందని, 'ఏక్ భారత్––శ్రేష్ఠ భారత్' సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు హిందీ ప్రసంగాలు, పాటలు, స్కిట్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు షాహినా బేగం, కవిత, షఫీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికురాలికి మెరుగైన వైద్యాన్ని అందించాలి

## - సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్



**కొత్తగూడెం సింగరేణి సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని బస్టాండ్ సెంటర్లో ఆక్సిడెంట్ ఐన కొత్తగూడెం పారిశుద్ధ కార్మికురాలు మల్లీశ్వరి కి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ నెల 10వ తేదీన కారు యాక్సిడెంట్ అవ్వడం వల్ల ఆమె కు తీవ్ర గాయాలయాయి.మల్లీశ్వరి కి మెరుగైన వైద్యం అందించి చికిత్స వేగవంతం చేయాలని కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కి సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. తీవ్ర గాయాలు పాలైన ఆమె ఏ పని చేయలేని పరిస్థితి ఉందన్నారు. అలాగే తలకు, చేతులకి,కాళ్ళకి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం పని చేయలేని స్థితిలో ఉన్న మల్లీశ్వరి కి తిరిగి పనిలో వచ్చేవరకు తన ఆరోగ్యం కుదుటపడే వరకు జీతం చెల్లించాలని ఆయన అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లీశ్వరిని సిఐటియు జిల్లా ప్రతినిధి బృందం భూక్య రమేష్ ,లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, పప్పుల ప్రమోద్, డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి మంద నాగకృష్ణ పరామర్శించారు.

# నిరుపేద కుటుంబాలకు సఫా బైతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ అండ

## - 50 కుటుంబాలకు తోపుడు బండ్ల పంపిణీ




**కొత్తగూడెం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించేందుకు సఫా బైతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. బండ్లతో పాటు కూరగాయలు, పండ్లు, ప్లాస్టిక్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జమియతే ఉలమా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ పేద కుటుంబాలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సఫా బైతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

# బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా



**అచ్చంపేట, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**
దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అమ్రాబాద్ మండలం మన్ననూరు బస్టాండ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రైమ్, ఎన్ఎస్‌యూఐ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి యశ్వంత్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని, వారిని పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పడంతోపాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కమిటీ సభ్యులు, సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి వైద్య సేవలకు 'ఉత్తమ సేవా' పురస్కారం

## - వైద్య సుగుణారావుకు ఘన సన్మానం



**కొత్తగూడెం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
పారంపర్య వైద్య రంగంలో ప్రకృతి వైద్యం, ఆల్టర్నేటివ్ థెరపీలో విశిష్ట సేవలు అందిస్తున్న వైద్య జి. సుగుణారావుకు 'వైద్య ఉత్తమ సేవా పురస్కారం' లభించింది. భద్రాచలంలో నిర్వహించిన పారంపర్య వైద్య మహాసంఘం తెలంగాణ 3వ మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. యోగ గురువు బ్రహ్మచారి, శ్రీ శ్రీ శ్రీ శివ స్వామీజీ, మహాసభ అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి, ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు, సజ్జన రమేష్, పుత్తూరు చంద్రశేఖర రాజు, రామంచి శ్రీనివాస్, దుర్గారాణి, వైద్యశ్రీ జమాల్ ఖాన్ తదితరుల చేతుల మీదుగా సుగుణారావు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సుగుణారావు మాట్లాడుతూ పారంపర్య వైద్య విధానాలకు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా సేవలు కొనసాగిస్తానని తెలిపారు.

# కొత్తగూడెంలో ముగిసిన బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు సమ్మె

## - డిమాండ్లు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల సమ్మె

## అప్పటికీ స్పందించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మె : యుఎఫ్.బియు






**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కొత్తగూడెం పరిధిలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు చేపట్టిన ఒకరోజు దేశవ్యాప్త సమ్మె శుక్రవారం విజయవంతంగా ముగిసింది. బ్యాంకింగ్ రంగంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారానికి ఐదు రోజుల పనిదినాల విధానం ను తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులందరికీ న్యాయమైన పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని ఎస్‌బీఐ ఆర్‌బీఓ కార్యాలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు బ్యాంకు ఉద్యోగులు, అధికారులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ బ్యాంకింగ్ విధానాలకు వ్యతిరేకంగా, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఏజీఎస్ కె. శ్రీకాంత్, కొత్తగూడెం రీజినల్ సెక్రటరీ కె. అర్జున్, యూనియన్ బ్యాంకు ప్రతినిధులు అరుణ్ కుమార్, శ్రీకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రతినిధులు కె. నిశ్చల్, విద్యాసాగర్, ఎస్‌బీఐ అవార్డు స్టాఫ్ లీడర్ భవానీ శంకర్, డీసీసీబీ లీడర్ వెంకట కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఏ) బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. ఒకరోజు సమ్మె కారణంగా ఖాతాదారులకు కలిగిన అసౌకర్యానికి వారు విచారం వ్యక్తం చేస్తూ, తమ పోరాటానికి సహకరించిన ఖాతాదారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నుంచి బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.

# 17న తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలి

## - కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు



**కొత్తగూడెం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు అమరవీరుల త్యాగాలను గౌరవించాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్, హైదరాబాద్‌లో తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. విమోచన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడం, స్మారక స్థూపాలు ఏర్పాటు చేయడం, విమోచన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్, ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, కార్యదర్శి దురిశెట్టి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాకేష్ బాబు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, పాల్వంచ టౌన్ అధ్యక్షుడు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు వీర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎసీపీఆర్ఎంఎస్, గ్రాట్యుటీ ట్రస్ట్ బోర్డు సమావేశం

## - పదవీ విరమణ కార్మికుల వైద్య సమస్యలపై ఏఐటీయూసీ కీలక డిమాండ్లు



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
సింగరేణి ప్రధాన కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులతో యాజమాన్యం సీపీఆర్ఎంఎస్, గ్రాట్యుటీ ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించింది. పదవీ విరమణ కార్మికుల వైద్యం, సీపీఆర్ఎంఎస్ నిధులు, రిఫరల్ వైద్య బిల్లులు, గ్రాట్యుటీ తదితర అంశాలపై ఏఐటీయూసీ నాయకులు పలు డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సీపీఆర్ఎంఎస్ రూ.8 లక్షల పరిమితితో సంబంధం లేకుండా తీవ్రమైన అనారోగ్యాలకు వైద్యం అందించాలని కోరారు. హైదరాబాద్ రిఫరల్ వైద్య బిల్లుల చెల్లింపులను ఆన్‌లైన్ చేసి త్వరితగతిన పరిష్కరించాలని, సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్‌లో అదనంగా రూ.50 కోట్లు జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ ట్రస్ట్‌లో మిగిలే నిధులను పదవీ విరమణ కార్మికుల ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ (పా) గౌతం పోట్రూ, జీఎం వెల్ఫేర్, ఈఈఈ, ఆర్సీ, సీఎంఓ, జీఎం ఫైనాన్స్, సీఎంఓఏ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

## - పంటలకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి: ఏఐకేఎంఎస్



**టేకులపల్లి, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి, పంటలకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఉక్ల డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ బాడీని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. రైతులకు రుణమాఫీ, కొత్త రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర, సరైన బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో పడిగ మంగమ్మ, పార్వతి, కృష్ణ, రమేష్, కారం నాగేష్, ఈసం శ్రీను, మల్లయ్య, నాగేశ్వరరావు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిరసన ర్యాలీలో గొడుగునూరి లక్ష్మారెడ్డి




**తల్లాడ, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
బీఆర్ఎస్, బీజేపీ దళిత వ్యతిరేక చర్యలను ఖండిస్తూ ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు దీపక్ చౌదరి ఆధ్వర్యంలో సంజీవరెడ్డి భవన్ నుంచి జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి మూడు ముంతల గంగరాజు, జిల్లా అధికార ప్రతినిధి అశోక్ పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోసూరి వెంకటేశ్వర్లు (కేవీ), మారెళ్ల మల్లికార్జునరావు, మూకర ప్రసాదు, తాళ్ల జోసెఫ్, తాళ్ల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన



**తల్లాడ, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
మండలంలోని కొత్త వెంకటగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను తహశీల్దార్ పి. కరుణాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్ర పరిధిలోని రికార్డులను తనిఖీ చేసి, 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలని బీఎల్ఓ మాధవికి సూచించారు. కొత్త ఓటర్లు, తొలగింపులు, ఓటరు కార్డుల పంపిణీ వివరాలను బీఎల్ఓ తహశీల్దార్‌కు అందజేశారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వర ఆలయానికి రూ.లక్ష విరాళం




**అచ్చంపేట, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**
శ్రీశైల క్షేత్రానికి ఉత్తర ముఖద్వారంగా వెలసిన శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో నంద్యాల జిల్లా వాసులు యాసం వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటలక్ష్మమ్మ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని దంపతులు తెలిపారు. విరాళం అందించిన దంపతులకు ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం , సెప్టెంబర్ 12 , 2026

# మరణం పొంచి ఉంది.. జాగ్రత్త!

## - మానవతా విలువలతో జీవించాలి: షేక్ అబ్దుల్ బాసిత్



**కొత్తగూడెం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
జీవితం శాశ్వతం కాదని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు మరణించాల్సిందేనని జమాతే ఇస్లామీ హింద్ సభ్యుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శుక్రవారం మేదరబస్తీ గణేష్ టెంపుల్ పరిధిలోని మస్జిద్ ఏ వహీద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనిషి చేసిన మంచి పనులే మరణానంతరం వెంట వస్తాయని, అధర్మం, అన్యాయం, అధికార దుర్వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇతరులకు మంచి చేయలేకపోయినా చెడు చేయకుండా మానవతా విలువలతో జీవించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సంభవించిన వరదలు, ప్రమాదాలు జీవితం క్షణికమనే విషయాన్ని గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్, జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు ఫారూఖ్ యజ్దాని, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# లలిత కళల వైపు విద్యార్థులు దృష్టిసారించాలి

## - భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు




**కొత్తగూడెం, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
విద్యార్థులు చదువుతో పాటు లలిత కళలపై ఆసక్తి పెంచుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. శుక్రవారం రామకృష్ణ శారదాకుటీర్ అర్ధనారీశ్వర స్వామి దేవాలయంలో అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 81 స్వర అర్చన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్న అకాడమీ నిర్వాహకుడు అలిపిరెడ్డి ఉదయ్‌భాస్కర్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న 40 మంది బాలబాలికలు, విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల మేధోశక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. 55వ దేవాలయంలో సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అకాడమీ కుటుంబ సభ్యులకు ఉదయ్‌భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్ టౌన్ సీఐ కరుణాకర్,అమృత వర్షిణి అకాడమీ సభ్యులు,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం



**చుంచుపల్లి (తెలంగాణ వాణి):**
మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెనుబల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను పూజిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగుల వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని తెలిపారు. ప్రతి ఇంట్లో మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శారద. హరిలాల్ సుజాత. రాజా. విజయ.ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# కట్కూరి నర్సయ్య చిత్రపటానికి 'తెలంగాణ వాణి' ఎడిటర్ సంపత్ నివాళి



**చిట్యాల, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి దినపత్రిక)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కట్కూరి ఐలయ్య తండ్రి కట్కూరి నర్సయ్య పెద్దకర్మ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 'తెలంగాణ వాణి' దినపత్రిక ఎడిటర్ జేరిపోతుల సంపత్, జిల్లా స్టాఫర్ వంశీకృష్ణ, జమ్మికుంట రిపోర్టర్ పుల్లూరి చేరాలు, చిట్యాల మండల రిపోర్టర్ కట్కూరి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ కట్కూరి ఐలయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పాత్రికేయులు, గ్రామస్తులు పాల్గొని నర్సయ్యకు నివాళులర్పించారు.

# పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వస్తువులు ఇవ్వాలి

## - సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబరు 11 (తెలంగాణ వాణి):**
గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సబ్బులు, బట్టలు, నూనె, బెల్లం, చెప్పులు, శానిటేషన్ కిట్లు తదితర వస్తువులను వెంటనే పారిశుధ్య కార్మికులకు అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. పెండింగ్ వస్తువులు అందించకపోతే పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. పెరిగిన పనిభారానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికుల సంక్షేమానికి అవసరమైన పరికరాలను క్రమం తప్పకుండా అందించాలని కోరారు. కాగా పెండింగ్ వస్తువులను సెప్టెంబరు 15న అందజేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల దుర్గమ్మ, యూనియన్ నాయకులు చందర్, సుశీల, అశోక్, నరశయ్య, మల్లీశ్వరి, రాజలక్ష్మి, సునీల్, సంజీవ్, ప్రకాష్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో మోహన్‌రావు పటేల్ జన్మదినం



**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ జన్మదినం సందర్భంగా కార్యకర్తలు పలు సేవా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.తొలుత బాసర లోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.పూజారులు ఆయన పేరిట అర్చన నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణం లోని యాచకులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం భైంసాలోని కైలాష్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో గోవిందస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వచనాలు పొందారు.భైంసా ఏరియా ఆసుపత్రిలో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని రోగులు, వారి సహాయకులకు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమాల్లో





ప్రజా ట్రస్ట్ ప్రతినిధులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# స్కూల్ బ్యాగులను పంపిణీ చేసిన ఎంఈఓ బి నీరజ

## - ప్రభుత్వ పాఠశాల్లోని పేద విద్యార్థులకు చేతన ఫౌండేషన్ సహకారం అభినందనీయం




**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సేవా సంస్థలు అండగా నిలవడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బి. నీరజ అన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పెనగడప, లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎంపీపీఎస్ హోలీ తండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 100 మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా సేవా సంస్థలు, దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుపై ఆసక్తిని పెంచవచ్చన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తమవంతు సహకారం అందించాలని సూచించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించిన చేతన ఫౌండేషన్ నిర్వాహకులకు ఎంఈఓ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. కమలాబాయి, పిఆర్ టియు జిల్లా అధ్యక్షులు రవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాములు, చేతన ఫౌండేషన్ వాలంటరీ రూప్లా నాయక్, వి సురేష్, బి సురేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గ ఆలయం నందు ప్రత్యేక పూజలు



**నకిరేకల్ : సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
నకిరేకల్ పట్టణంలోని శ్రీ కనకదుర్గ దేవి ఆలయం నందు శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో దుర్గాదేవి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో భాగం గా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్ కందాల సత్తిరెడ్డి , ఆలయ ధర్మకర్త గోలి పద్మ , మరియు ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి: ఆరుగురి అరెస్ట్

**ఎండపల్లి:సెప్టెంబర్11(తెలంగాణ వాణి)**
ఎండపల్లి మండల పరిధిలోని గుల్లకోట గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్గటూర్ ఎస్సై పి.ఉదయ్ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,510 నగదుతో పాటు 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ప్రజలు చట్టవిరుద్ధమైన పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గుప్తంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# పేదింటి బిడ్డకు డాక్టరేట్ పట్టా




**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
కొత్తగూడెం నెహ్రూబస్తీకి చెందిన సంధ్యాల కొమరయ్య, శంకరమ్మల కుమార్తె సంధ్యాల హైమావతి ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ సాధించారు. హైదరాబాద్‌లోని ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ శివప్రసాద్ శుక్ల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. రసాయన శాస్త్ర విభాగంలో డాక్టర్ ఆలియా పర్యవేక్షణలో 'డాకింగ్ స్టడీస్ అండ్ టెట్రాజోల్ డెరివేటివ్స్' అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి పట్టుదలతో ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ ప్రముఖులు, మిత్రులు హైమావతిని అభినందించారు.